సాక్షి అనకాపల్లి

సోమవారం, 24, జూన్, 2024



విశేషంగా ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. 8లో

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

విశాఖ జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8లో



గరిష్ఠం/కనిష్ఠం
35.3/25.5

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ పరిధిలో కొంత మంది భక్తులు తమ గృహాల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు. క్యూ కాంప్లెక్స్‌లన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులు తీరారు. వృద్ధులు, గర్భిణులకు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు 17 మంది ఎంపిక

అచ్యుతాపురం: కర్నూలులో వచ్చే నెల 13 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనున్న క్రీడాకారులను ఆదివారం మండలంలోని వెదురువాడ శివారు ఆక్సిజన్ రిసార్ట్స్‌లో ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు 17 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్టు జిల్లా సిమ్మింగ్ క్రీడాకారుల అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ దేముడు తెలిపారు. గ్రూప్ -1 లో బాలుర విభాగంలో రెడ్డి తేజ, బాలికల విభాగంలో జి.ధార్మిక, గ్రూప్ - 2లో బాలుర విభాగంలో ఎస్.శ్రీధనుష్సు, జి.చైతన్య, టి.సాయి,రణధీర్ కార్తీక్,ఎన్.అనిరుధ్, బాలికల విభాగంలో ఆర్.లలిత, నవ్య, ఎల్.సాహితి, గ్రూప్-3 బాలుర విభాగంలో జి.సోహన్‌రాయ్, యువన్ సాయి, ఎల్.హిమ ప్రభాస్, వి.హర్షవర్ధన్, బాలికల విభాగంలో ఎస్.మోక్షిత, అవని ఆనంద్, బేతని ఎంపికయ్యారు. వీరు 50 మీటర్లు,100 మీటర్లు,200 మీటర్లు, బటర్‌ఫ్లై, ఫ్రీ స్టయిల్ కేటగిరీల్లో జరిగే పోటీల్లో పాల్గొనున్నారు.

దోనె బోల్తా - మత్స్యకారుడి మృతి



దుర్గయ్య మృతదేహం

రోలుగుంట: మండలంలోని కొమరవోలు ఆవలో దోనె బోల్తా పడి కొమరవోలు గ్రామానికి చెందిన కర్రి దుర్గయ్య అనే మత్స్యకారుడు మృతి చెందాడు. మృతుడి భార్య వరహాలమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎల్.సురేష్ కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్రి దుర్గయ్య(65) ఎప్పటి మాదిరిగానే ఆదివారం ఉదయం దోనెలో కొమరవోలు ఆవలోకి చేపల వేటకు వెళ్లాడు. ఆవలో కొంతదూరం వెళ్లిన తరువాత తెడ్డు విరిగిపోయి దోనె బోల్తా పడడంతో దుర్గయ్య నీటిలో పడి మునిగిపోయాడు. మధ్యాహ్నం అయినా భర్త రాకపోవడంతో వరహాలమ్మ స్థానికులను తీసుకుని ఆవ వద్దకు వెళ్లింది. అక్కడ నీటిపై తేలుతూ దుర్గయ్య మృతదేహం కనిపించింది. దీంతో ఆమె రోలుగుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు శవ పంచానామా చేసి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టానికి మృతదేహాన్ని తరలించారు. మృతుడి ఒక కుమార్తె కూడా ఉంది. దుర్గయ్య మృతిచెందడంతో భార్య వరహాలమ్మ తీవ్రంగా రోదించింది. సర్పంచ్ గొర్లె రమణమ్మ, ఎంపీటీసీ రామన్, స్థానిక పెద్దలు బోశం దొరబాబు, రమేష్ దొర తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు జీవీఎంసీలో వినతుల స్వీకరణ

డాబాగార్డెన్స్(విశాఖ): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 24 నుంచి ప్రతి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో 'పజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహిస్తున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందని.. నగర ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆలస్యంగా బెంగళూరు-విశాఖ స్పెషల్

తాటిచెట్లపాలెం(విశాఖ): ఎస్ఎంవీ బెంగళూరు -విశాఖపట్నం(08550) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం 8.50 గంటలకు బయలుదేరాల్సి ఉండగా.. పెయిరింగ్ రైలు రాక ఆలస్యంతో ఉదయం 11.45 గంటలకు బయలుదేరింది. అంతే ఆలస్యంగా ఈ రైలు ఆయా స్టేషన్లకు రాకపోకలు సాగిస్తుందని అధికారులు తెలిపారు.

టీడీపీ 'కోర్టు'లో బార్క్ నిర్వాసితుల సమస్య

- ఇకనైనా కేసులు తొలగి, న్యాయం జరిగేనా?
- వివాదాలు పరిష్కరించాలని బాధితుల వినతి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అడ్డంకులు సృష్టించిన టీడీపీ మద్దతుదారులు



తంతడి వద్ద సేకరించిన భూములు

అచ్యుతాపురం: మండలంలోని తంతడి పంచాయతీ పరిధిలో బాబా అణు పరిశోధన కేంద్రం (బార్క్) కోసం సుమారు పదేళ్ల కిందట కేటాయించిన భూములకు సంబంధించిన పరిహారం అందక నిర్వాసితులు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు తయారు చేసిన నిర్వాసితుల జాబితాలో అనర్హులున్నట్టు ఆరోపణలు వచ్చాయి. మొత్తం 318 ఎకరాలకు సంబంధించి రూపొందించిన జాబితాలో 98 ఎకరాల విషయంలో ఎలాంటి ఆధారాలు చూపలేకపోయారు. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మళ్లీ సర్వే జరిపి రూపొందించిన జాబితా ఆధారంగా పరిహారం ఇచ్చే సమయంలో కొందరు టీడీపీ మద్దతుదారులు కోర్టుకు వెళ్లడంతో సమస్య మొదటికి వచ్చింది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈసారైనా టీడీపీ మద్దతుదారులు సమస్య పరిష్కారానికి సహకరిస్తారా? లేదా? అని నిర్వాసితులు ఎదురు చూస్తున్నారు.

అచ్యుతాపురం మండలంలోని సముద్ర తీర ప్రాంతంలో ఉన్న కొండ ప్రాంతంలో తోటలు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్న మత్స్యకారులు, అనుబంధ వృత్తుల కుటుంబాలకు బార్క్ భూసేకరణతో కొత్త సమస్య వచ్చిపడింది. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూముల్ని పరిశ్రమల పేరుతో సేకరించడంతో కనీసం పరిహారమైనా అందుతుందనే ఆశతో ఉన్నారు. వారికి అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో న్యాయం జరగలేదు. తర్వాత వచ్చిన వైఎస్సార్ సీపీ హయాంలో సర్వే చేసి మళ్లీ జాబితా రూపొందిస్తే కొందరు కోర్టుని ఆశ్రయించి అడ్డంకులు సృష్టించారు.

98 ఎకరాలే అసలు సమస్య

తంతడి, దోసూరు, చిప్పాడ పంచాయతీల పరిధిలో 2,200 ఎకరాలను బార్క్ కోసం సేకరించారు. దీనిలో కొండ ప్రాంతాలు కూడా ఉన్నాయి. తంతడి పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 238లో 318 ఎకరాలకు సంబంధించి అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్వాసితుల జాబితా రూపొందించింది. జాబితాపై అనుమానాలు రావడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మళ్లీ సాగుదారులపై సర్వే చేశారు. అయితే దీనిలో 220 ఎకరాల వరకూ రైతుల సాగులో ఉన్నట్లు గుర్తించినప్పటికీ, మిగిలిన 98 ఎకరాల పరిధిలో సాగుదారులు తమ హద్దులు, ఇతర భూ హక్కులు, సాగుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు సమర్పించలేకపోయారు. దీంతో వారిని బినామీలుగా ప్రాథమికంగా నిర్ణయించారు. అనంతరం అర్హులతో కొత్తజాబితా రూపొందించారు. కొత్త జాబితా ప్రకారం పరిహారం ఇచ్చేందుకు నిర్వహించాల్సిన గ్రామ సభలో కొందరు నేతలు రాద్ధాంతం సృష్టించారు. తర్వాత కోర్టును ఆశ్రయించారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. తాజాగా ప్రభుత్వం మారిన నేపథ్యంలో కోర్టు కేసులు పరిష్కరించి, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాబట్టి అర్హులైన నిర్వాసితులకు న్యాయం జరుగుతుందా? లేక గతంలో టీడీపీ రూపొందించిన జాబితా ప్రకారమే పరిహారమే పరిహారం అందిస్తారా అన్న చర్చ సాగుతోంది. పరిహారం అందక పదేళ్లగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని ఈ ప్రాంత మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఇటు బార్క్ నిర్వాసితుల సమస్య,అటు నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.



జారుదుబల్ల వద్ద నీటి ప్రవాహం

భారీ వర్షం..పొంగిన గెడ్డలు

కనువిందు చేస్తున్న జలపాతాలు



నెహ్రూచౌక్‌లో కురుస్తున్న వర్షం



ధారమఠం స్నానాల రేవు వద్ద పరవళ్లు తొక్కుతున్న నీరు


గొలుగొండ: మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు కుండపోతగా వర్షం కురిసింది. సుమారు ఐదు గంటల పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం పడడంతో గెడ్డలు పొంగి ప్రవహించాయి. ధారకొండ ఎగువన భారీగా వర్షం కురవడంతో ధారమఠం వద్ద జలపాతాలు పాలనురుగులతో పరవళ్లు తొక్కాయి. శివాలయం ప్రాంతంలో జారుడుబల్ల, స్నానాలరేవు, ప్రధాన జలపాతం వద్ద నీరు ఉధృతంగా ప్రవహించింది. ఆదివారం సెలవు రోజు కావడం, భారీ వర్షం కురవడంతో యువత పెద్ద ఎత్తున శివాలయం వద్దకు చేరుకుని జలపాతం వద్ద స్నానాలు చేశారు. తాండవ జలాశయానికి ప్రధాన ఆధారమైన ధారగెడ్డ, బొడ్డేరు, బోరింగ్ గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి.

అనకాపల్లిలో...

అనకాపల్లి: పట్టణంలో సోమవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. 15.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైయింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. నారుమడులు వేసుకునేందుకు వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు తెలిపారు.

హ్యాండ్లింగ్.. వెరీ లేట్!

- పోర్టులో రోజుల తరబడి నిలిచిపోతున్న షిప్‌లు
- అస్తవ్యస్తంగా మారిన కార్గో హ్యాండ్లింగ్
- బెర్తుల కేటాయింపులో ట్రాఫిక్ సిబ్బంది నిర్లక్ష్యం
- వ్యవస్థలో లోపాలే కారణమంటూ కుంటిసాకులు
- కొత్త ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ట్రేడర్లు



విశాఖపట్నం పోర్టు



సరకు హ్యాండ్లింగ్

సాక్షి, విశాఖపట్నం : నెల రోజుల క్రితం వరకూ మేజర్ పోర్టులతో పోటీ పడుతూ దూసుకుపోయిన విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ).. ఇప్పుడు చతికిలపడుతోంది. సరకు హ్యాండ్లింగ్‌లో వరుస రికార్డులు సృష్టించిన పోర్టు.. ఇప్పుడు అదే సరకు రవాణా విషయంలో నీలి సముద్రమంత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ట్రాఫిక్ విభాగ వైఖరి కారణంగా కార్గో హ్యాండ్లింగ్ కోసం బెర్తుల కేటాయింపుల్లో నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ట్రేడర్లు మొరపెట్టుకుంటున్నా తమకేమీ పట్టనట్లుగా పోర్టు అధికారులు వ్యవహరిస్తుండటంతో హ్యాండ్లింగ్ క్రమంగా కుంటుపడుతోంది.

ఒకే నెలలో అత్యధిక సరకు హ్యాండ్లింగ్.. ఏడాది వ్యవధిలో అత్యధికంగా కోల్ కోక్ దిగుమతి.. భారీగా క్రూడ్ ఆయిల్ నిర్వహణ.. కంటైనర్ల ఎగుమతిలో సరికొత్త రికార్డు.. రెండు మూడు నెలల క్రితం.. పోర్టు ఖాతాలో జమ అయిన రికార్డులివి. సరకు రవాణా విభాగంలో దేశంలోని మేజర్ పోర్టుల్లో కొన్నింటికి సాధ్యం కాని రికార్డులను సైతం తన ఖాతాలో జమ చేసుకున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ ప్రస్తుతం నెమ్మదిస్తోంది. ట్రాఫిక్ సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా హ్యాండ్లింగ్ చాలా ఆలస్యంగా సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోర్టుకు చేరుకున్న కార్గో షిప్‌లకు సరైన బెర్తింగ్ ఇవ్వడంలో సంబంధిత విభాగాధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వచ్చిన షిప్‌లు బెర్తింగ్ కాకపోవడం సరకు గోదాములకు చేరుకోకపోవడం కొత్త షిప్‌లకు బెర్తులు దొరక్కపోవడంతో పోర్టులో గజిబిజి వాతావరణం నెలకొంది.

రెండు మూడు రోజులైనా..

ఇటీవల కాలంలో రెండు మూడు రోజులైనా సరకుతో వచ్చిన షిప్‌లకు బెర్తులు ఇవ్వడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. షిప్ వచ్చిందని హ్యాండ్లింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ట్రేడర్లు అడిగే వరకూ ట్రాఫిక్ విభాగాధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇటీవల గుజరాత్ నుంచి వచ్చిన ఓ అధికారి ఈ వ్యవహారాలను పూర్తిగా విస్మరించేశారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్టివడోర్లకు అందుబాటులోకి రావడం లేదని ఆయన లేకపోవడంతో దిగువ స్థాయి సిబ్బందికి అడుగుతున్నా సరైన స్పందన రావడం లేదంటూ వాపోతున్నారు. ఫలితంగా తీవ్ర నష్టాల్ని చవిచూస్తున్నామంటూ స్టివడోర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ట్రాఫిక్ విభాగంలో ఈ తరహా ఇబ్బందులు ఎప్పుడూ ఎదుర్కోలేదని స్టివడోర్స్ చెబుతున్నారు. ట్రాఫిక్ నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడం కూడా పోర్టు విస్మరించడం విస్మయానికి గురి చేస్తోందని ఆరోపిస్తున్నారు.

కొత్త చిక్కులు తెచ్చిన ట్రక్ పార్కింగ్ టెర్మినల్

ఈ ఏడాది సరకు హ్యాండ్లింగ్ 90 మిలియన్ మెట్రిక్ టన్నులు దాటాలంటూ పోర్టు చైర్మన్ లక్ష్యాన్ని నిర్దేశించినా ఆ పరిస్థితులు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ముఖ్యంగా పోర్టు ఇటీవల రూ.40 కోట్ల వ్యయంతో అందుబాటులోకి తీసుకొచ్చిన ట్రక్‌పార్కింగ్ టెర్మినల్ కారణంగా ట్రేడర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ టెర్మినల్ పోర్టుకు లాభాలు తీసుకొస్తుందే తప్ప.. సరకు రవాణాకు పెద్దగా ఒరిగిందేమీ కనిపించడం లేదు. పోర్టు ఏరియాకు సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఈ ట్రక్ టెర్మినల్ ఉంది. ఒక ట్రక్‌ని పార్కింగ్ చేయాలంటే రోజుకు రూ.150 వరకూ ట్రేడర్లు చెల్లించాల్సి ఉంటుంది. సరకు ఎగుమతి, దిగుమతి చేసుకోడానికి పోర్టుకు ట్రక్ వెళ్లాలంటే.. కచ్చితంగా టెర్మినల్ నుంచే బయల్దేరాలి. అయితే.. బెర్తింగ్ విషయంలో ట్రాఫిక్ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్ల.. రెండు మూడు రోజులు టెర్మినల్‌లో ట్రక్‌లు ఉండాల్సి వస్తోంది. ఫలితంగా.. ఒక్కో ట్రక్‌కు రూ.450 వరకూ చెల్లించడంతో పాటు 16 కిలోమీటర్ల మేర డీజిల్ అదనపు భారంగా మారుతోంది. ఈ కారణంగా.. వచ్చిన లాభాలన్నీ.. పోర్టుకే జమ చేయాల్సి వస్తోందంటూ స్టివడోర్స్ వాపోతున్నారు. మౌలిక సదుపాయాలపైనా కనీస దృష్టి సారించడం లేదని ఈ వ్యవహారాలను డిప్యూటీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నా ఆయన పట్టించుకోవడం లేదంటూ ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ విభాగంపై చైర్మన్ దృష్టిసారిస్తే తప్ప.. పోర్టు బాగుపడదని విమర్శిస్తున్నారు. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే స్టివడోర్స్ అంతా పక్కనే ఉన్న గంగవరం పోర్టు వైపు అడుగులు వేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మధురవాడ(విశాఖ): కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రతిభా పాఠశాల (సీవోఈ)లో మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి. నాగమణి చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9 తరగతుల్లో ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. 26వ తేదీ ఉదయం 10గంటలు నుంచి సాయంత్రం 4గంటలు వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్ కార్డు, కులం, ఆదాయం, స్టడీ సర్టిఫికేట్ జత చేస్తూ దరఖాస్తు చేయాలన్నారు. 28వ తేదీ ఉదయం 10గంటలు నుంచి మధ్యాహ్నం 12గంటలు వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. కొమ్మాది జంక్షన్ సమీపంలోని రిక్షా కాలనీలో గల గాయత్రి మహిళా ఇంజినీరింగ్ కళాశాల వెనుక గల బాలికల గురుకుల ప్రతిభా పాఠశాలకు చేరుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94927 85400, 83286 57824లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ నాగమణి కోరారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ పోటీలు



హ్యాండ్ బాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఎంవీపీకాలనీ(విశాఖ): ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని ఏబీసీ పార్క్‌లో ఆదివారం హ్యాండ్ బాల్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ప్రపంచ ఒలింపిక్ డే, ప్రపంచ హ్యాండ్ బాల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యాండ్ బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రాజారావు మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎంతో ఆదరణ పొందిన క్రీడల్లో హ్యాండ్‌బాల్ ఒకటన్నారు. ఈ క్రీడలో విశాఖ నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడంతో పాటు ఉన్నత ఉద్యోగ అవకాశాలు సైతం పొందారన్నారు. వారి స్ఫూర్తితో నేటి యువత హ్యాండ్ బాల్‌లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు పూసపాటి సత్యనారాయణరాజు, వి.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ



అవగాహన ర్యాలీలో ఎన్‌సీసీ క్యాడెట్లు

బీచ్‌రోడ్డు(విశాఖ): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో, ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ సంయుక్తంగా ఆదివారం సాగర తీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించింది. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీని నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో సూపరింటిండెంట్ రాజన్ కుమార్, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో యువత జీవితాలపై చూపిస్తున్న ప్రభావంపై అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో 300 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, యువతీ యువకులు పాల్గొన్నారు. లెఫ్టినెంట్ జె.రామారావు, ఫ్లైట్ లెఫ్టినెంట్ డీఆర్ లక్ష్మణ్ రెడ్డి, లెఫ్టినెంట్ సంజయ్ కుమార్, థర్డ్ ఆఫీసర్ గంగరాజు, సతీష్ కుమార్ తదితరుల పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ వార్షిక స్నానం





పల్లకీలో స్వామివారి ఊరేగింపు(ఇన్‌సెట్) స్వామివారికి అభిషేకం

కొమ్మాది(విశాఖ): బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీ జగన్నాథ వార్షిక స్నానం అత్యంత వైభవంగా జరిగింది. జగన్నాథుడికి ఏడాదికి ఒక్కరోజు జ్యేష్ఠ పూర్ణిమ నాడు మాత్రమే అభిషేకం చేస్తారు. ఈ ఉత్సవాన్ని ఆదివారం ఇస్కాన్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు. జగన్నాథ స్వామికి 35 కలశాలు, బలరామునికి 33 కలశాలు, సుభద్రకు 22 కలశాలు, సుదర్శనుడికి 18 కలశాలతో అభిషేకం చేపట్టారు. అభిషేకించిన జలాన్ని భక్తులకు తీర్థంగా అందజేశారు. అనంతరం జగన్నాథ బలభద్ర సుభద్ర ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో పల్లకీలో ఊరేగించారు.

క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపం లోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం(విశాఖ) : విశాఖ జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం జ్యేష్ఠ శుద్ధ పాడ్యమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.


చేపలను వ్యాన్‌లో లోడ్ చేసి తరలిస్తున్న మత్స్యకారులు


రొయ్యలతో మత్స్యకారుడు


రొయ్యల గ్రేడింగ్


బాక్స్‌ల్లో చేపల లోడింగ్

వలల నిండా.. మత్స్యసిరులు..

మహారాణిపేట: మత్స్యకారుల పంట పడింది. వలలకు భారీగా చేపలు, రొయ్యలు చిక్కాయి. వేటకు వెళ్లిన బోట్లు మత్స్య సంపదతో ఆదివారం ఫిషింగ్ హార్బర్‌కు చేరుకోవడంతో సందడి నెలకొంది. సుమారు రెండు నెలల విరామం తర్వాత హార్బర్.. మత్స్యకారులు, వ్యాపారులు, కొనుగోలుదారులతో కిటకిటలాడింది. వేట నిషేధం అనంతరం మత్స్యవేట ఆశాజనంగా సాగడంతో మత్స్యకారులు సంతోషంగా వ్యక్తం చేశారు. భారీ సంఖ్యలో కవ్వాళ్ల, రొయ్యలు, సార చేపలు లభించడంతో వాటిని స్థానికంగా విక్రయించడంతో పాటు వ్యాన్, కంటైనర్లలో కేరళ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేశారు.


బాక్స్‌ల్లో నింపుతున్న ఐస్


ప్యాకింగ్ చేస్తున్న కలాసీ


కంటైనర్‌లో తరలింపునకు సిద్ధం

వీసీబీ సభ్యులకు 12 శాతం డివిడెండ్

బ్యాంక్ చైర్మన్ రాఘవేంద్రరావు


మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ రాఘవేంద్రరావు

సీతమ్మధార (విశాఖ): విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్(వీసీబీ) సభ్యులకు 12 శాతం డివిడెండ్ చెల్లిస్తున్నట్లు బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ప్రకటించారు. కాకతీయ కల్చరల్ అసోసియేషన్ హాలులో ఆదివారం బ్యాంక్ 109వ వార్షిక మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 శాతం డివిడెండ్ చొప్పున రూ.38.79 కోట్లు చెల్లించనున్నట్లు వెల్లడించారు. బ్యాంక్ డైరెక్టర్ జె.వి. సత్యనారాయణమూర్తి ప్రవేశపెట్టిన సంప్రదింపుల కమిటీల ఎన్నికపై తీర్మానానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులు, మేనేజర్లకు మధ్య సంప్రదింపుల కమిటీలు పనిచేస్తాయన్నారు. ప్రతి మూడు నెలలకు ఓసారి సంప్రదింపుల కమిటీలు సమావేశమవుతాయన్నారు. ప్రతి మూడేళ్లకు ఓసారి ఏర్పాటయ్యే ఈ సంప్రదింపుల కమిటీల్లో ప్రస్తుతం ఉన్న బ్యాంక్ శాఖల్లో 430 మంది సభ్యులు అవుతారన్నారు. మరో డైరెక్టర్ సి.కృష్ణమోహన్ రావు అనుబంధ సంస్థ ఏర్పాటుపై ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశంలో ఆమోదించారు. చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొని ఎటువంటి ఆటంకాలు లేకపోతే అమలు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. చార్టర్డ్ అకౌంటెంట్, డైరెక్టర్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ 179 మొండి ఖాతాలను సాంకేతికంగా రద్దు చేసి.. రుణ ఖాతాలుగా వర్గీకరించేందుకు పాలకవర్గం నిర్ణయించిందన్నారు. అంతకుముందు బ్యాంక్ అభివృద్ధికి సుదీర్ఘ సేవలు అందించిన మానం ఆంజనేయులు రాజీనామాను ఈ సభలో ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గం కృషితో భవిష్యత్‌లో బ్యాంక్ మరింత అభివృద్ధి చెందగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో సీనియర్ వైస్ చైర్మన్ గుడివాడ భాస్కరరావు, డైరెక్టర్లు ఎస్.నాగభూషణ చౌదరి, ఎ.జె.స్టాలిన్, ఎస్.కామరాజు, కె.వాణి, జి.జనార్ధనరావు, సిహెచ్.ఆదినారాయణశాస్త్రి, ఎస్.జానకి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

అనకాపల్లి : అక్రమగా మద్యం తరలిస్తున్న కశింకోట మండలం తాళ్లపాలెం గ్రామానికి చెందిన బండారు శ్రీను అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు సీఐ శంకరరావు చెప్పారు. పట్టణంలో రింగ్‌రోడ్డు జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బండారు శ్రీను 15 మద్యం క్వార్టర్ బ్యాటిళ్లు తరలిస్తూ పట్టుబడ్డాడని, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.


ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

మర్రిపాలెం (విశాఖ): ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. అల్లిపురం హరిజన వీధిలో తల్లిదండ్రులతో కలిసి నివాసముంటున్న పేరాడ నందిని ఈ నెల 22 నుంచి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆమె ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఇటీవల కంచరపాలెం దరి ఐటీఐ జంక్షన్ వద్ద వారి బంధువుల ఇంటికి వెళ్లిన ఆమె.. 22వ తేదీ ఉదయం అదృశ్యమైంది. బంధువుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె తండ్రి సురేష్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నందిని చామనఛాయ రంగుతో సుమారు 5 అడుగుల ఎత్తు కలిగి ఉంటుంది. ఇంటి నుంచి వెళ్లేటప్పుడు కాలేజీ యూనిఫాం (లేత నీలం రంగు టాప్, చున్నీ, డార్క్ నీలం రంగు ఫ్యాంట్) ధరించి ఉంది. ఆమె ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని ఐదో పట్టణ పోలీసులు కోరారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

పరవాడ : కలపాక సమీపంలో ఎన్టీపీసీ రైల్వేలైన్‌లో గూడ్స్ రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పరవాడ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పిట్టవానిపాలెం-కలపాక గ్రామాలకు అతి సమీపంలో ఎన్టీపీసీ రైల్వేలైను ఉంది. ఆదివారం ఉదయం 6.30 సమయంలో గుర్తు తెలియని వ్యక్తి రైల్వేట్రాక్‌పై నడిచి వెళుతుండగా వెనుక వస్తున్న గూడ్స్ రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. రైలు ట్రాక్‌ను పర్యవేక్షిస్తున్న ఎన్.వెంకటరమణ విషయాన్ని గుర్తించి పరవాడ పోలీసులకు సమాచారం అందించాడు. ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి యాచకుడిగా భావిస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ఈ కేసును పరవాడ ఎస్ఐ టి.మల్లేశ్వరరావు చేస్తున్నారు.

కేంద్ర మంత్రి దృష్టికి భెల్ సమస్యలు


కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న భెల్ బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్

అక్కిరెడ్డిపాలెం: కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మను భీమవరంలో ఆదివారం భెల్(హెచ్‌పీవీపీ) విశాఖ యూనిట్ బీఎంఎస్ నాయకులు కలిశారు. భెల్ సమస్యలపై యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.రమేష్ కుమార్, ప్రతినిధులు కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు. సంస్థకు కావాల్సిన ఆర్డర్లు, ఆర్టిసన్ రిక్రూట్‌మెంట్, ఎక్కువ మార్జిన్ ఉన్న ఉత్పత్తుల ఎంపిక తదితర అంశాలను వినతిపత్రంలో పొందుపరిచారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి.. రాష్ట్రంలోని ఏకైక యూనిట్ హెచ్‌పీవీపీకు కావాల్సిన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం, కార్పొరేట్ యాజమాన్యంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేసినట్లు రమేష్‌కుమార్ తెలిపారు. సంయుక్త ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, బీఎంఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లోవ రెడ్డి పాల్గొన్నారు.

ఆశ్రమంలో అనాథల ఆకలి కేకలు

- స్పందించిన హెచ్‌ఆర్‌సీ సభ్యులు
- లయోలా వృద్ధాశ్రమానికి తరలింపు

ఆరిలోవ (విశాఖ): ఓ ఆశ్రమంలో ఆకలితో అలమటిస్తున్న అనాథలకు స్థానికులు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సంస్థ(హెచ్‌ఆర్‌సీ) ప్రతినిధులు అండగా నిలిచారు. ఆశ్రమంలో ఉన్న నలుగురిని వేరే వృద్ధాశ్రమానికి తరలించారు. వివరాలివీ.. జీవీఎంసీ 13వ వార్డు పరిధి రామకృష్ణాపురంలో 'కీర్తి ఫౌండేషన్'పేరుతో ఆశ్రమం నిర్వహిస్తున్నారు. ఇక్కడ అనాథలైన వృద్ధులు, బాలలకు ఉచితంగా వసతి కల్పిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. గతంలో ఈ ఆశ్రమాన్ని ఇదే వార్డు పరిధి కేంద్ర కారాగారం పక్కన శ్రీ కృష్ణాపురంలో నిర్వహించేవారు. సుమారు ఏడాది కిందట రామకృష్ణాపురంలోని ఓ ఇంట్లోకి మార్చారు. ఇక్కడ అనాథ వృద్ధులు, బాలలకు ఆశ్రయం కల్పించి భోజనం అందిస్తున్నామని దాతలు వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు. కానీ ఆశ్రమంలో వృద్ధులు, బాలలకు సరిగ్గా భోజనం పెట్టడం లేదు. ప్రస్తుతం ఇక్కడ కళ్లు సరిగా కనిపించని ఓ వృద్ధురాలు, మరో ఇద్దరు వృద్ధులతో పాటు దివ్యాంగురాలైన బాలిక ఉంది. వీరికి సుమారు ఆరు నెలలుగా సరిగ్గా భోజనం పెట్టడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో స్థానికుల్లో కొందరు ఒక్కో రోజు వీరికి భోజనం అందిస్తున్నారు. కాగా.. ఇటీవల స్థానికుల ద్వారా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సంస్థ(హెచ్‌ఆర్‌సీ) ప్రతినిధులు ఈ సమాచారం తెలుసుకున్నారు. ఆశ్రమానికి ఆదివారం హెచ్‌ఆర్‌సీ సభ్యులు చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి సహకారంతో పెందుర్తిలో లయోలా వృద్ధాశ్రమానికి ఈ నలుగురిని తరలించారు. ఈ ఆశ్రమాన్ని ఆరిలోవ ప్రాంతానికి చెందిన సురేష్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఆర్‌సీ సభ్యులు జయకృష్ణ, గోవిందరావు, వెంకటకృష్ణ, మహేశ్వర్, ఎ.కె. రాజు తెలిపారు. సురేష్ ఇటీవల రామకృష్ణాపురానికి చెందిన ఓ మహిళకు ఆశ్రమం నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్లు వారు వివరించారు. ఆశ్రమం పేరుతో దాతల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న నిర్వాహకులు.. ఆ డబ్బులతో జల్సాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సీపీకి ఫిర్యాదు చేస్తామని, ఇలాంటి ఆశ్రమాలపై పోలీసులు నిఘా పెట్టాలని కోరారు.

తెలుగు తమ్ముడు హర్టయ్యాడు..!

13వ వార్డులో టీడీపీ ఫ్లెక్సీల గోల

ఆరిలోవ (విశాఖ): తెలుగు తమ్ముడు హర్టయ్యాడు. నేను సీనియర్ టీడీపీ నాయకుడ్ని.. జూనియర్ కార్యకర్తలు ఫొటోలు పైన వేసి..దిగువన నా ఫొటో వేస్తారా? అంటూ ఆదివారం చిందులు వేశాడు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు జన్మదినం సందర్భంగా శనివారం కేంద్రకారాగారం ఎదురుగా రామకృష్ణాపురంలో టీడీపీ నాయకులు ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వెలగపూడి రామకృష్ణ బాబు ఫొటో తరువాత వరుసుగా స్థానిక నేతల ఫొటోలు ముద్రించారు. పైన జూనియర్ కార్యకర్తలు ఫొటోలు వేయడంతో సీనియర్ నేత అవమానంగా భావించి..అక్కడ కట్టిన ఫ్లెక్సీని చింపేశాడు. దీంతో సదరు సీనియర్ నేతపై కొందరు తెలుగు తమ్ముళ్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెలగపూడి నచ్చజెప్పి కేసును విరమింపజేశారు. ఇదిలా ఉండగా ఇదేవార్డు పరిధి ఆరిలోవ కాలనీలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినవారి ఫొటోలు వేయలేదట. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం చేటుచేసుకుంది. అనంతరం టీడీపీలో కొత్తగా చేరినవారు మరో ఫ్లెక్సీ తయారు చేయించి పక్కనే ఏర్పాటు చేశారు.

యువకుడిపై చాకుతో దాడి

నిందితుడి అరెస్ట్


గాయాలపాలైన కిషన్ నాగ్

అగనంపూడి (విశాఖ): యువకుడిపై చాకుతో దాడి చేసిన ఘటనలో దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి ఇస్లాంపేటలో జరిగింది. దువ్వాడ సీఐ వావిలిపల్లి ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివీ.. పెదగంట్యాడ మండలం ఇస్లాంపేటకు చెందిన కిషన్‌నాగ్ తన ముగ్గురు మిత్రులతో కలిసి శనివారం రాత్రి మద్యం సేవించారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో కడితిల్నాయుడులేనికి చెందిన ఆశ అనే వ్యక్తి.. వీరితో పరిహాసాలకు దిగాడు. ఇది కాస్త శృతిమించి గొడవకు దారితీసింది. ఆశ సమీపంలోని ఇంట్లో కూరగాయలు తరిగే చాకుతో కిషన్ నాగ్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో కిషన్ నాగ్‌కు తీవ్ర రక్తస్రావం కావడం, క్షతగాత్రుడు కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. ముందుగా 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా సమాధానం లేకపోవడంతో 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దువ్వాడ పోలీసులు తెల్లవారుజామున ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని అగనంపూడి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపండి


సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

చోడవరం రూరల్: జిల్లాలో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యకు కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం పరిష్కారం చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్థానిక శ్రీకాంత్ కల్యాణమండపంలో ఆదివారం జరిగిన ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల ముగింపులో భాగంగా జరిగిన కార్యక్రమంలో లోకనాథం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నో ఆశలు చూపి అధికారానికి వచ్చిందని, వాటన్నిటినీ అమలు చేసే దిశగా అడుగులు వేయాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల సమస్యలతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, అసంఘటిత రంగ కార్మికులు, స్కీం వర్కర్లు, దళితులు, గిరిజనులు, ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో ఓట్లు వేసి గెలిపించిన ప్రభుత్వం వారి ఆశలను నెరవేర్చే దిశగా సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ దిశగా ప్రజల తరపున పోరాడేందుకు పార్టీ శ్రేణులు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎపిడమిక్ సీజన్ ప్రారంభంతో వైద్య సిబ్బందిని సమాయత్త పరచాలని, చోడవరం సుగర్స్ బకాయిల చెల్లింపు, ఫ్యాక్టరీ ఆధునికీకరణ, రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా, రోడ్ల మరమ్మతులు, ప్రభుత్వ ఆస్పత్రులు, వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై ఎన్నికైన ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న మాట్లాడుతూ జిల్లాలోని రైతాంగ సమస్యల పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపాలన్నారు. మధ్యలోనే నిలిచిపోయిన ప్రజాగృహాల నిర్మాణ పనులు తక్షణం చేపట్టి, పూర్తి చేయాలని డిమాండ్‌చేశారు. 24 మండలాల నుంచి హాజరైన పార్టీ శ్రేణుల సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు వి.వి.శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు, ఎస్.వి.నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఆర్.దేముడునాయుడు, గండి నాయన్ బాబు, ఇ.నర్సింహమూర్తి పాల్గొన్నారు.

పండ్ల వ్యాపారి ఇంట్లో చోరీ


బాధితుల నుండి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్న ఎస్ఐ ఉమామహేశ్వరరావు


బీరువా విరగ్గొట్టిన దుండగులు

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి 28వ వార్డులో ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు అందించిన వివరాలివి. వార్డులో నివాసం ఉంటున్న సూరిశెట్టి వెంకటరమణ పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 22న ఉదయం రమణ కుటుంబ సభ్యులతో కలిసి పండ్ల వ్యాపారానికి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఇది గమనించిన దుండగులు పట్ట పగలు ఆ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. సాయంత్రం రమణ కుటుంబం ఇంటికి వచ్చి చూడగా, ఇంటి తలుపులు తీసి ఉండి, ఇంట్లోని బీరువాలోని బట్టలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. దీంతో వారు ఆందోళనతో బీరువాలో చూడగా, అందులోని ఐదు తులాల బంగారం అభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు చోరీకి గురైన ఇంటిని క్లూస్ టీమ్‌తో వెళ్లి పరిశీలించారు. ఇంట్లోని ఆనవాళ్లను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

టీడీపీ కార్యాలయం రోడ్డు.. మందుబాబులకు అడ్డా




విశాఖలో టీడీపీ ప్రధాన కార్యాలయం ముందు..
సాయంత్రం 4.30 సమయంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న యువకులు

మహారాణిపేట (విశాఖ): రామ్‌నగర్ ప్రాంతంలోని తెలుగుదేశం జిల్లా ప్రధాన కార్యాలయం రోడ్డు.. మందుబాబులకు అడ్డాగా మారింది. సాయంత్రం అయితే చాలు ఇక్కడ మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. ఈ రహదారి మీదుగా ఆస్పత్రులు, విద్యా సంస్థలకు జనాల రాకపోకలు అధికంగా ఉంటుంది. వీరి ఆగడాల వల్ల అటువైపుగా వెళ్లాలంటే మహిళలు, వాహనచోదకులు భయపడుతున్నారు. మద్యం సేవించి రోడ్డుపై వీరంగం వేస్తుండటంతో చుట్టుపక్కల నివాసితులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ర్యాంప్‌పై షోకులు


ఫ్యాషన్ వాక్ చేస్తున్న మోడల్

బీచ్‌రోడ్డు (విశాఖ): సాగర తీరాన అందాల భామలు కిర్రాక్ పుట్టించారు. ర్యాంప్‌లపై ఫ్యాషన్ వాక్ చేస్తూ మైమరిపించారు. క్యాట్ వాక్లతో కిర్రెక్కించారు. జేడీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ వార్షిక ఫ్యాషన్ డిజైనర్ అవార్డుల వేడుక బీచ్‌రోడ్డులోని నోవాటెల్‌లో ఆదివారం జరిగింది. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్స్ చేస్తున్న విద్యార్థినులు డిజైన్ చేసిన విభిన్న వెరైటీల్లో గల దుస్తులను బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన మోడల్స్ ధరించి ర్యాంక్ వాక్ చేశారు. రేస్ ఎంటర్‌టైన్‌మెంట్ నేతృత్వంలో జరిగిన ఈ మెగా ఈవెంట్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జేడీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ విశాఖ బ్రాంచ్ అధినేత కట్టమూరి ప్రదీప్, దివ్య దంపతులు, నేషనల్ డైరెక్టర్ రూపల్ దలాల్, బ్రాండిక్స్ కంపెనీ ఇండియా భాగస్వామి దొరైస్వామి, వర్ధమాన కథానాయిక భావన సాగి ప్రారంభించారు. 12 ఏళ్లుగా విశాఖలో ప్రతి ఏటా తమ సంస్థ ఈ ఫ్యాషన్ డిజైన్ అవార్డుల వేడుకలను నిర్వహించి విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీస్తున్నట్లు ప్రదీప్ తెలిపారు. 30 మందికి పైగా విద్యార్థినులు ఏడు రౌండ్లలో భాగంగా 300 పైనే వివిధ రకాల వెరైటీల్లో దుస్తులను డిజైన్ చేశారని వివరించారు. ఈ పోటీల్లో ఐదుగురు విజేతలను ఎంపిక చేసి అవార్డులు అందజేసినట్లు తెలిపారు. రేస్ ఈవెంట్ మేనేజర్ దాడి రవి కుమార్, రెడ్ మేగ్జైన్ చందు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్షంతో ఉపశమనం



మండల పరిషత్ కార్యాలయం ముందు చేరిన వర్షపు నీరు

కశింకోట : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పెద్ద వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండలతో సతమతమవుతున్న ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. వాతావరణం చల్లబడింది. ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దుక్కి దున్ని వరి విత్తనాలు వేసుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. నాట్లు వేయడానికి భూమిని సిద్ధం చేస్తున్నారు. వర్షం వల్ల పలు చోట్ల పంట భూములు, పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది.

జీతాలు చెల్లించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు

కశింకోట : కశింకోట పంచాయతీలో తమకు ఆరు నెలలుగా రావలసిన వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వరుసగా మూడో రోజు ఆదివారం పారిశుధ్య కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రిక్షా స్టాండ్ వద్ద నుంచి పెద్ద బజారు వరకు ఈ ర్యాలీ సాగింది. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) అధ్యక్షుడు కొల్లి రామంజి, కార్యదర్శి జి. వెంకటరమణ, ప్రతినిధులు కొండబాబు, ఆదిలక్ష్మి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ అమ్మవారు

అనకాపల్లి : మండలంలోని మార్టూరు గ్రామంలో ఆదివారం మోదకొండమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అమ్మవారి మహోత్సవం కావటంతో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు చైర్మన్ పి.పెంటారావు, కార్యదర్శి ఒ.మధు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
మనమే	:సత్యనారాయణ స్క్రీన్-1
మ్యూజిక్ షాప్ మూర్తి	:సత్యనారాయణ స్క్రీన్-2
భజే వాయు వేగం	:షిర్డిసాయి
లవ్ మౌళి	:పర్తిసాయి
ఓఎంజీ(ఓ మంచి ఘోస్ట్)	:వెంకటేశ్వర
ప్రభుత్వ జూనియర్ కళాశాల	:శ్రీసత్య
హరోం హర	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-18యూనిట్లు, బీ పాజిటివ్-6 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 256 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 205 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది గ్రామీణ స్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటే ఆరోగ్యకరంగా జీవించవచ్చని వైద్య సిబ్బంది చెబుతున్నారు. దేశంలో 2047 నాటికి ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.



కేటీవీ పాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తుమ్మపాల వైద్యురాలు వాణి జగదీశ్వరి, సిబ్బంది

- సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన తప్పనిసరి
- మండలంలో 10 మంది వ్యాధిగ్రస్తులు
- రోగులకు నెలకు రూ.10 వేలు పింఛన్ అందజేత



బట్లపూడిలో అవగాహన కల్పిస్తున్న ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు

అనకాపల్లి : సికిల్ సెల్ ఎనీమియా అనేది అంటు వ్యాధి కాదు. వ్యాధి సోకిన రోగి శరీరంలో రక్త శాతం రోజురోజుకు తగ్గిపోతుంది. ముందుగా వ్యాధిని గుర్తించినట్లయితే ప్రత్యేక చర్యల ద్వారా వ్యాధి సోకిన వ్యక్తిని కాపాడుకోవచ్చు. వ్యాధి సోకిన వారి శరీరంలో అన్ని అవయవాలు దశల వారీగా వివిధ రుగ్మతల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. భారతదేశంలోని 17 రాష్ట్రాల్లో ఈ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. మండలంలో 10 మంది సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్నారు. వ్యాధి సోకిన వ్యక్తికి రక్తమార్పిడి చేయాల్సి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ఈ ఏడాది జూన్ 19 నుంచి జూలై 3వ తేదీ వరకూ అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాయి. మండలంలో తుమ్మపాల, తగరంపూడి, పట్టణ పరిధిలో వ్యాధిపై రోజుకొక ప్రాంతంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.
- కొన్ని సమయాల్లో వ్యాధి సోకిన వ్యక్తికి నెలకు రెండు సార్లు రక్తం మార్చాల్సి ఉంటుంది.
- ఈ వ్యాధి సోకినట్లయితే రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్టంగా మారతాయి. దీంతో శరీర భాగాలకు సరైన రీతిలో రక్త సరఫరా జరగదు. అటువంటి సమయంలో అవయవాలు దెబ్బతినే పరిస్థితి ఎదురవుతుంది.
- సాధారణ రక్తకణాలతో పోలిస్తే సికిల్ సెల్ (కొడవలి కణాలు)కణాలు దృఢంగా ఉంటాయి. అటువంటి కణాల బిగుతు, అసాధారణ ఆకారం శరీరంలోని చిన్న రక్తనాళాల ద్వారా కదిలే సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. రక్త ప్రవాహంలో అడ్డంకి ఏర్పడి తీవ్రమైన నొప్పి కలుగుతుంది.
- తల్లిదండ్రుల నుంచి లోపభూయిష్ట జన్యువు సంక్రమించినప్పుడు సికిల్ సెల్ ఎనీమియా అని పిలువబడే తీవ్రమైన వ్యాధికి దారి తీస్తుంది.
- ఈ వ్యాధితో బాధ పడుతున్న రోగికి ప్రభుత్వం నెలకు రూ.10 వేలు పింఛ అందజేస్తుంది.

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలు

1. రక్త కణాల సంఖ్య తగ్గడం (రక్తహీనత)
2. కళ్లు పసుపు రంగులోకి మారడం
3. తీవ్రమైన ఒంటి, కీళ్ల నొప్పులు
4. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
5. అలసట
6. తరచుగా వచ్చే అంటువ్యాధులు
7. గర్భధారణ సమయంలో సమస్యలు
8. అవయవ నష్టం

అవగాహన కలిగి ఉండాలి..



తల్లిదండ్రుల నుంచి వ్యాపించే సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కలిగి ఉండాలి. పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి రక్త పరీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాం. వ్యాధి బారిన పడిన వ్యక్తికి సకాలంలో మందులు పంపిణీ చేస్తున్నాం. ఈ వ్యాధి సోకితే రక్తం ఎక్కించుకోవాలి. ఐరెన్ మాత్రలు వాడాలి. పళ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలి. జాగ్రత్తలు పాటించినట్లయితే ఆరోగ్యంగా జీవించవచ్చు.

– జి.పావని, పీహెచ్‌సీ వైద్యురాలు, తగరంపూడి

వైద్యుల సూచనలు పాటించాలి..



సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని గుర్తించేందుకు గ్రామాల్లో దశల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇది అంటువ్యాధి కాదు. అయినప్పటికీ తగిన జాగ్రత్తలో ఉండాలి. రోగాన్ని సకాలంలో గుర్తించి, మంచి ఆహారం తీసుకుంటే ప్రాణహాని ఉండదు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. సరైన ఆహారం, వైద్యుల సూచనలు పాటించడం, మెరుగైన జీవన విధానంతో ఈ వ్యాధి ఉన్నప్పటికీ సాధారణ జీవితం గడపవచ్చు

– బి.మంగమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్, తుమ్మపాల పీహెచ్‌సీ

పేదలకు చేయూతనివ్వడమే వాసవీ క్లబ్ ధ్యేయం

డాన్ టు డస్క్‌లో పలు సేవా కార్యక్రమాలు



పేద మహిళలకు చీరలు అందిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



వడ్డాదిలో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మాడుగుల రూరల్: వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్‌ల ద్వారా పేదలకు చేయూతనివ్వడమే ప్రధాన ధ్యేయమని క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.వి.సత్యనారాయణ తెలిపారు. డాన్ టూ డస్క్ కార్యక్రమంలో భాగంగా జంపెన వాసవీమాత ఆలయం వద్ద ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా జూన్ నెలలో క్లబ్ తరఫున సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న వాసవి సభ్యులు ఐక్యతతో పనిచేయాలన్నారు. కింతలి–గాదిరాయి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీపీ స్కూల్‌కు పిల్లలకు స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. చిరు వ్యాపారులకు పెద్ద గొడుగులు, దివ్యాంగులకు చేతి కర్రలు, పేదలకు చీరలు, దుస్తులు అందించారు. స్థానిక క్లబ్ వ్యవస్థాపకులు, జంపెన వాసవీ మాత ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా మోహనరావు పర్యవేక్షణలో జరిగిన కార్యాక్రమంలో వాసవి ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఎ.రత్నావతి, ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనివాసరావులు మాట్లాడారు. జంపెనకు చెందిన మేడిశెట్టి అర్జున్‌రావు సోదరులు, డి.గొటివాడకు చెందిన పుట్టా నాగరాజు ఆర్థిక సాయంలో కొత్తగా ఏర్పాటు చేసిన వాసవీ మాత ఆలయ ఉత్తరం, తూర్పు గేట్లను ప్రారంభించారు. కార్యక్రమములో క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జునరావు, కార్యదర్శి అనపగడ్డ అప్పారావు, కోశాధికారి పి.కొండారావు, జిల్లా కోశాధికారి అనపగడ్డ హరిబాబు, జోన్ చైర్మన్ నాచు గున్నయ్యశెట్టి, రీజనల్ చైర్మన్ శ్రీనాధు కన్నయ్యశెట్టి, ఉపాధ్యక్షుడు కోట్యాడ గున్నయ్యశెట్టితో పాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది గ్రామంలో వాసవీ క్లబ్ సభ్యులు ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీరవల్లి, పోతన పూడి, వడ్డాది గ్రామాలకు చెందిన క్లబ్ సభ్యులు మూడు గ్రామాల్లో పేదలకు గొడుగులు, దుస్తులు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పాదచారులు కూర్చుని సేద తీరేందుకు రోడ్డు పక్కన బెంచీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు రత్నావతి, సత్యనారాయణ, సాంబమూర్తి, శ్రీనివాస్, రమేష్, మురళి, కన్నయ్యశెట్టి, గున్నయ్యశెట్టి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలి



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న లక్ష్మి

మునగపాక : చదువుతో పాటు అన్ని రంగాలపైనా అవగాహన పెంచుకోవాలని భగవద్గీత బోధకులు భీశెట్టి లక్ష్మి కోరారు. మంగళవరపుపేటలోని మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, భగవద్గీత శ్లోకాలు వాటి అర్థాలపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ భగవద్గీత ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయ అధ్యక్షులు భీశెట్టి ధనశ్రీను మాట్లాడుతూ గ్రంథాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రాయింగ్‌లో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. గ్రంథాలయ కార్యదర్శి యల్లపు సంజీవరావు, కోశాధికారి ఆడారి అప్పలనాయుడు, డైరెక్టర్లు సునీత, తులసి, అనురాధ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అడ్డురోడ్డులో మానవత స్వచ్ఛంద సంస్థ నూతన శాఖ



సమావేశమైన మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఎస్.రాయవరం : ఉత్తమ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గాజువాక అధ్యక్షుడు ఎంవీ సుబ్బరాజు అన్నారు. పెదగుమ్ములూరు గ్రామంలో అడ్డురోడ్డు మానవత స్వచ్ఛందశాఖ ఏర్పాటుకు పలువురు వ్యాపారులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు ఆదివారం సమావేశం అయ్యారు. త్వరలో అడ్డురోడ్డులో నూతన శాఖ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ స్వచ్ఛంద సంస్థలో మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, రక్తం గ్రూపులు నిర్ధారణ చేసి జాబితాను సిద్ధం చేయడం, అంబులెన్స్ సేవలు, ఉచిత వైద్యశిబిరాలు, మార్చురీ ఫ్రీజర్లు, శాంతి ర్యాలీలు నిర్వహణ వంటి కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యేజర్ల పెరుమాళ్లరాజు, మాజీ సర్పంచ్‌లు పుట్టా సుధాకర్, ఎస్.వి.ఎస్ మధువర్మ, అడ్డురోడ్డు వర్తక సంఘ నాయకులు చంద్రశేఖర్‌రావు, రామ్‌కోటి, చంటిరాజు, సాగి పాండురంగవర్మ తదితరులు పాల్గొన్నారు.

21 రోజుల పాటు ధ్యానంపై అవగాహన

మునగపాక : మండలంలోని నాగులాపల్లి చంద్రశేఖర పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఈ నెల 24 నుంచి జూలై 14 వరకు ధ్యానంపై అవగాహన కార్యక్రమం జరుగుతుందని సీనియర్ పిరమిడ్ టీచర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. 21 రోజుల పాటు ప్రతి రోజూ రాత్రి 8.30 గంటల నుంచి 9.45 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ధ్యానంతో ఆరోగ్యం అలాగే ఎదుగుదలపై అవగాహన, స్పష్టతతో అద్భుతంగా జీవించడానికి చిట్కాలు, పరివర్తనాత్మక ధ్యాన ప్రయాణం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సుజాత కోరుతున్నారు.

కొబ్బరితోట వేలం రేపు

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో గ్రామ దేవత ఆలయ భూమిలో కొబ్బరి తోట వేలం నిర్వహించనున్నట్టు దేవదాయశాఖ ఈవో సాంబ శివరావు తెలిపారు. పి.ధర్మవరం తారురోడ్డును ఆనుకుని సర్వే నంబర్ 31/1లో ఎకరా 70 సెంట్లు భూమి ఉన్నట్టు చెప్పారు. ఈ మేరకు బుధవారం ఎస్.రాయవరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం రెండు గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ పాటలో పాల్గొనదలిచే వారు రూ. 5000 ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

52 మంది యువకుల రక్తదానం



కొండపాలెంలో రక్తదానం చేస్తున్న యువకులు

బుచ్చెయ్యపేట: మండలంలోని కేపీ అగ్రహారంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 52 మంది యువకులు రక్తదానం చేశారు. చేగువేరా ఫౌండేషన్, వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. కేపీ అగ్రహారం, కొండపాలెం, బుచ్చెయ్యపేట, అయితంపూడి, పైడంపేట, పెదమదీనా తదితర గ్రామాలకు చెందిన యువకులు రక్తదానం చేశారు. సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, స్థానిక నాయకుడు ముచ్చకర్ల నాయుడు యువకుల్ని అభినందించారు.

ముమ్మరంగా వరి నారుమడి దుక్కులు



మామిడివాడ సమీపంలో ట్రాక్టరుతో దుక్కి దున్నుతున్న రైతు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో వరి నారుమడి దుక్కు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మామిడివాడ, గోకివాడ, పంచదార్ల, దిమిలి, కొత్తూరు, కట్టుబోలు, రాజుకోడూరు, రజాల, కుమ్మరాపల్లి, మత్రిపాలెం, మురకాడ సహా పలు గ్రామాల్లో ట్రాక్టర్ల సాయంతో రైతులు దుక్కి పనులు చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు 8 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు నారుమడుల తయారీలో రైతులు నిమగ్నమయ్యారు. రైతులకు వ్యవసాయశాఖ రాయితీపై వరి విత్తనాలను అందజేస్తుంది. మరో వారం పది రోజుల్లో విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధపడుతున్నారు.

మోదమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల: స్థానిక మోదమాంబ అమ్మ వారి ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. పరిసర గ్రామాలు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి, అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుష్పాల అప్పలరాజు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 18న అమ్మవారి పండగ అనంతరం ఈ వారం భక్తుల తాకిడి పెరిగింది.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



తాళ్లపాలెంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనకాపల్లి : స్థానిక శ్రీరామ్‌నగర్‌లో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి రాష్ట్రానికి ఒక చట్టం ఉండదని, కాశ్మీర్‌కి ఒక చట్టం, మిగతా రాష్ట్రాలకు ఒక చట్టం ఉండవని గట్టిగా చెప్పి కాంగ్రెస్ నుండి బయటికి వచ్చిన నేత ముఖర్జీ అన్నారు. జనసంగ్ పార్టీని స్థాపించిన ఆయన ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో ప్రతి రాష్ట్రానికి ఒకే చట్టం అమలు చేయాలని శ్యాం ప్రసాద్ ముఖర్జీ నిరాహార దీక్ష చేసేందుకు కాశ్మీర్ వెళ్లి అక్కడ అరెస్ట్ తర్వాత చనిపోయారని తెలిపారు. ఇది ఇప్పటికీ తేలని మిస్టరీగా ఉండిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ కామేష్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శులు కన్నాజి నాగేశ్వరరావు, బద్రి, కొండలరావు, బీజేపీ ఏబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ, పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో..

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన త్యాగాలను వక్తలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు, పార్టీ మండలాధ్యక్షుడు కరక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అప్పికొండ అప్పారావు, యువమోర్చా ఉపాధ్యక్షుడు బి. శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అయినాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో ఇక్కట్లు



కశింకోట పంచాయతీ ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్త

కశింకోట : పంచాయతీ పరిధిలో పని చేసే పారిశుధ్య కార్మికులు తమకు రావలసిన వేతన బకాయిల కోసం ఉద్యమ బాట పట్టడంతో పలు చోట్ల వీధుల్లో చెత్త పేరుకుపోయింది. దీంతో ప్రజలు ఇబ్బంది చెందుతున్నారు. పంచాయతీలో పని చేస్తున్న 30 మంది పైబడి పారిశుధ్య కార్మికులకు ఆరు నెలలుగా వేతన బకాయిలు చెల్లించడం లేదు. దీంతో ఆదివారానికి మూడు రోజులుగా కార్మికులు ధర్నాలు, ర్యాలీల ద్వారా ఆందోళన జరుపుతున్నారు. వారు విధులకు రాకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి అధ్వానంగా మారింది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను వివరణ కోరగా పంచాయతీలో నిధుల లేమి దృష్ట్యా ఈ నెల 26న పారిశుధ్య కార్మికులకు ముందుగా రెండు నెలల వేతనాలు చెల్లిస్తామని చర్చల సందర్భంగా కోరామన్నారు. వారు ముందుకు వస్తే రెండు నెలల వేతనాలు సత్వరమే చెల్లించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

నేతల విగ్రహాలకు తొలగిన ముసుగులు



ముసుగు తొలగించిన వైఎస్సార్ విగ్రహం



ముసుగు తొలగిన రాజీవ్‌గాంధీ విగ్రహం

సాక్షి ఎఫెక్ట్..

కశింకోట : 'సాక్షి' వార్తకు అధికారులు స్పందించారు. కశింకోటలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొలిగాయి. స్థానిక పంచాయతీ ప్రధాన రహదారిలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, దివంగత మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు తదితర నేతల విగ్రహాలకు ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ కారణంగా ముసుగులు వేశారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో కోడ్ తొలగించారు. ఈ నేపథ్యంలో విగ్రహాలకు ముసుగులు తొలగించని విషయమై 'సాక్షి'లో ఈ నెల 17న 'ముసుగులు తొలగించరూ..' శీర్షికన వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో స్పందించిన అధికారులు విగ్రహాల ముసుగులు తొలగించడంతో రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గురు శిష్యుల బంధం చాలా గొప్పది..



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న హిందూ జ్ఞాన వేదిక సభ్యులు

కోటవురట్ల : ఆత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని, అదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశ్యమని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి రాజమండ్రి కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు తెలిపారు. పందూరు గ్రామంలో జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆత్మను సంపూర్ణంగా దర్శించగలిగినపుడే శిష్యుడు గురుత్వాన్ని పొందగలడని అన్నారు. సృష్టిలో గురుశిష్యుల బంధం చాలా గొప్పదని తెలిపారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ గురించి తెలుసుకోవాలని, అందులో ఆత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని తెలిపారు. త్రిమత గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను రచించారని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, శ్రీనివాస్, స్వామినాయుడు, ఆదిత్య పాల్గొన్నారు.